కొలిక్కి వస్తున్న చెరువుల హద్దుల నిర్ధారణ

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): హెచ్‌ఎండీఏ పరిధిలో చెరువుల హద్దుల నిర్ధారణ ఎల్టకేలకు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. హైకోర్టు ఆదేశాలతో.. చెరువుల హద్దులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణ పనులపై హెచ్‌ఎండీఏ దృష్టి పెట్టింది. ఈ క్రమంలో నగరంలో చెరువుల పరిరక్షణలో కీలకమైన హద్దుల నిర్ధారణ వేగవంతం చేశారు. ఇప్పటివరకు 1,164 చెరువులకు తుది నోటిఫికేషన్ జారీకాగా, ఇంకా 1,773 చెరువులకు హద్దులను ఖరారు చేయాల్సి ఉంది. వీటిలో ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీచేసిన చెరువులను పునఃపరిశీలన చేయడంతోనే జాప్యం జరుగుతుందని హెచ్‌ఎండీఏ వర్గాలు చెబుతున్నాయి.

కలివివనం పోస్టర్‌ను ఆవిష్కరించిన కేటీఆర్

కలివివనం సినిమా పోస్టర్‌ను సోమవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి షాబాద్‌లో ఆవిష్కరించారు. ఏఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై పోలీస్ మల్లికార్జున్‌రెడ్డి, కోలన్ విష్ణువర్ధన్‌రెడ్డి నిర్మాతలుగా రాజ్ నరేంద్ర రచన, దర్శకత్వంలో పూర్తి తెలంగాణ పల్లెటూరి నేపథ్యంలో చిత్రీకరించారు. ఈ సినిమాను వనాలను రక్షించే నేపథ్యంలో జగిత్యాల జిల్లాలోని గుట్రాజుపల్లి, సారంగాపూర్ అడవి, మల్లంపేట, జగిత్యాలతోపాటు పలుచోట్ల షూటింగ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌రాష్ట్ర నాయకుడు కొలన్ ప్రభాకర్ రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

-షాబాద్, మే 26

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ

నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలి

చేవెళ్ల టౌన్, మే 26 : కేంద్ర ప్రభుత్వం నక్సలైట్లతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో చేవెళ్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జన సేవాదళ్ శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ఆ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేసి నక్సలైట్లతో చర్చలు జరపాలన్నారు. నక్సలైట్ల సమస్యను ఒక సైద్ధాంతిక రాజకీయ సమస్యగా చూడాలే కానీ.. తీవ్రవాద సమస్యగా పరిగణించొద్దని హితవు పలికారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు హేమంతరావు, జనసేవ రాష్ట్ర కన్వీనర్ రమేశ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు నర్సింగరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, సీపీఐ జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు, అంజయ్య, మక్బూల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ

మిస్ తెలుగు యూఎస్ఏ రన్నరప్‌గా చూర్ణిక

కాప్రా, మే 26: అమెరికాలో జరిగిన మిస్ తెలుగు యూఎస్ఏ-2025 పోటీల్లో కాప్రా ఏఎస్‌రావు నగర్‌లోని భవానీనగర్‌కు చెందిన చూర్ణికా కొత్తపల్లి రన్నర్ అప్‌గా నిలిచింది. ఏప్రిల్‌లో ఫైనల్ పోటీలకు ఎంపికైన చూర్ణిక డల్లాస్‌లో ఆదివారం రాత్రి (భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 11.30 గంటలకు) నిర్వహించిన టైటిల్ పోటీల్లో రన్నర్ అప్‌గా (ద్వితీయ స్థానం) నిలిచింది. దీనికి తోడు పీపుల్స్ ఛాయిస్ అవార్డును గెలుచుకొని రెండు కిరీటాలను సొంతం చేసుకొన్న చూర్ణిక కొత్తపల్లిని.. ఆయన తండ్రి కొత్తపల్లి రాంబాబు (బిల్డర్, లయన్స్ క్లబ్ ప్రతినిధి), కుటుంబ సభ్యులకు యూఎస్ఏలోని తెలుగువారితో పాటు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా చూర్ణిక తండ్రి కొత్తపల్లి రాంబాబు మాట్లాడుతూ.. టైటిల్ పోటీల్లో తుదివరకు పోరాడిన తన కూతురు రన్నర్‌అప్‌గా నిలువడం సంతోషంగా ఉందని అన్నారు. కృషి, ప్రతిభ, ధైర్యంతో పాటు రెండు రాష్ట్రాల అభిమానుల మద్దతుతో ద్వితీయస్థానం (రన్నర్ అప్) సాధించడంతో పాటు, పీపుల్స్ ఛాయిస్‌లో విజయం సాధించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. తన కూతురుకు ఓటుతో మద్దతు తెలిపిన వారందరికీ రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. చూర్ణిక ప్రస్తుతం ఫ్లోరిడాలో ఎంఎస్ చదువుతోంది.

ప్రతి జిల్లాలోనూ నీరా కేఫ్ ఏర్పాటుచేయాలి

గౌడ ఐక్య సాధన సమితి

చిక్కడపల్లి, మే 26: రాష్ట్రంలో గీత కార్మొరేషన్ ద్వారానే నీరా కేఫ్‌లను నిర్వహించాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ గౌడ్ మాట్లాడుతూ.. ఆగస్టు 18వ తేదీలోపు జనగామ జిల్లా పేరును పాపన్న జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు పెండింగ్‌లో ఉన్న గీత న్నుల నష్టపరిహారం, కొత్త పెన్షన్లు ఇవ్వాలన్నారు. ఉత్తర తెలంగాణలో గీత వృత్తిదారులపై జరుగుతున్న వీడీసీల దాడులను అరికట్టాలని అన్నారు. ప్రతి జిల్లాలో నీరా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతోపాటు.. చనిపోయిన గీత కార్మికుడికి 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు నక్క కృష్ణ గౌడ్, సర్వాయి పాపన్న మోకు దెబ్బ అధ్యక్షుడు జక్క వీరస్వామి, పటేల్ వెంకటేశ్ గౌడ్, జైగౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బురా మల్సూర్, సోషల్ డెమోక్రటిక్ జాతీయ అధ్యక్షుడు కోల జనార్దన్, శ్రీకాంత్ గౌడ్, కూరెల్ల వేములయ్య, బొనగాని యాదగిరిగౌడ్, ముద్ద గౌని రామ్మోహన్ గౌడ్, పరశురాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సంధ్య

ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి

టీఎస్‌డీఎఫ్ కన్వీనర్ వినాయక రెడ్డి

చిక్కడపల్లి, మే 26: కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర డెమోక్రటిక్ ఫోరం (టీఎస్ డీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీఎస్‌డీఎఫ్ కన్వీనర్ వినాయక రెడ్డి, పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలనే డిమాండ్‌తో ఈనెల 29న బషీబాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సదస్సును నిర్వహించనున్నమన్నారు. ఈ సదస్సుకు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్, సీపీఐ నాయకుడు నర్సింహ, సీపీఐ(ఎంఎల్) నాయకుడు చలపతిరావు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇండియన్ నేషనలిస్టు మూమెంట్ పార్టీ నాయకుడు కృష్ణ ప్రసాద్, హనుమేష్.ఆర్ఎస్పీ నాయకుడు జానకి రాములు, గోవర్ధన్, ఆరేళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

18 మంది దివ్యాంగులకు ఉద్యోగాలు

సిటీ బ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): అర్హులైన దివ్యాంగ అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. దివ్యాంగులకు కేటాయించిన 37 బ్యాక్‌లాగ్ పోస్టులను అర్హత కలిగిన 18 మందికి వివిధ కేటగిరీల్లో నియామక పత్రాలు అందించామని పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలకు 2018-19లో నోటిఫికేషన్ విడుదల కాగా వివిధ కారణాలతో నియామక ప్రక్రియ పూర్తికాలేదని చెప్పారు. 37 ఉద్యోగాల్లో ప్రస్తుతం 18 ఖాళీలను గుర్తించి అర్హులైన వివిధ వర్గాల దివ్యాంగ అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. ఉద్యోగాలు సాధించిన దివ్యాంగులు జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించి అభినందించారు. ఈ నియామక ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించిన డీఆర్ఓ వెంకటాచారి, జిల్లా సహాయ సంచాలకులు రాజేందర్, జహీరుద్దీన్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ముకుంద రెడ్డి, కదిరవన్ పలని, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేయర్ల శిక్షణ ప్రారంభం

భూభారతి అమలులో సర్వేయర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు లైసెన్స్‌డ్ సర్వేయర్స్ ట్రైనింగ్ సెంటర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వే శిక్షణ పొందేందుకు ఐటీఐ, సివిల్ ఇంజినీరింగ్ చేసిన నిరుద్యోగులైన హైదరాబాద్ జిల్లాకు చెందిన 76 మంది యువకులు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. వీరందరికీ అనుభవజ్ఞులతో 50 రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, జిల్లా సర్వే అధికారి వీ శ్రీరామ్, ఇన్‌స్పెక్టర్ అనంత రెడ్డి పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీ గట్టెక్కేదెలా?

ఫెయిలైన విద్యార్థులపై పర్యవేక్షణ ఏదీ?

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ) : ఏ విద్యార్థికైనా పదో తరగతి చాలా కీలకమైనది. ఉన్నత చదువులు చదవాలంటే పది గట్టెక్కాల్సిందే. అలాంటి కీలకమైన పరీక్షలకు విద్యార్థులు ఎంతో శ్రద్ధగా చదవాల్సి ఉంటుంది. ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షలు రాసి ఫెయిలైన విద్యార్థులు ఇప్పటికే కొంత మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. అలాంటి విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షల్లో విజయం దక్కేలా చొరవ చూపాల్సిన ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. ఏ సబ్జెక్టుల్లో విద్యార్థులు ఫెయిలయ్యారో వాటిలో పాసయ్యేలా సంబంధిత అంశాలపై బోధించాలి. కానీ ఆ దిశగా అధికారులు అడుగులు వేయడం లేదు. ఇప్పటికే సర్కార్ పాఠశాలల్లో అరకొర సిలబస్ మాత్రమే పూర్తవుతున్నది. దీంతో వారు అర్హమైకాకుండా పరీక్షలు రాసి కొందరు ఫెయిల్ అవుతున్నారు. 2024-25 విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకొని మార్చిలో జరిగిన పదో తరగతి వార్షిక పరీక్షల్లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో కలిపి మొత్తం 19,125 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 8,266 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాసుకాలేదు. ఇందులో చాలా మంది గణితం, సైన్స్, ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, హిందీలో అత్యధికంగా ఫెయిల్ అయ్యారు. కాగా, గణితం, ఇంగ్లిష్‌కు ట్యూషన్ చెప్పాల్సిన అవసరం ఉందని విద్యార్థులు చెబుతున్నారు. కలెక్టర్ స్పందించి ఈ వారం రోజులైనా గణితం, ఇంగ్లిష్ లాంటి సబ్జెక్టులపై బోధన చేయించాలని కోరుతున్నారు. కాగా, జూన్ 3 నుంచి 13 వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే.

ఈ ప్రభుత్వంలో మేం బతకలేం..!

రోజూ రూ.500లు సంపాదించే చోట రూ. 1000 జరిమానాలు ఎట్లా కట్టాలె

- జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో వీధి వ్యాపారుల ఆందోళన

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): ట్రాఫిక్ పోలీసుల వేధింపుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ వీధి వ్యాపారులంతా జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో సోమవారం ఉదయం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. నేషనల్ హాకర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దాదాపు నాలుగు గంటల పాటు నగరం నలుమూలల నుంచి తరలివచ్చి నిరసన ప్రదర్శన చేపట్టారు. సొంతంగా చిరు వ్యాపారం చేసుకుంటున్న తమపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో మాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవనోపాధి పొందామని, ఈ ప్రభుత్వంలో తాము బతకలేని పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.. రోజూ పని చేసుకుంటూ రూ.500, రూ.1000 వచ్చే షాపులకు వేలకు వేలు ఫైన్లు వేస్తుండటం ఎంత వరకు సమంజసమని ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మీర్ ఇనాయత్ అలీ బాక్రీ ప్రశ్నించారు. ఆపరేషన్ రోప్ పేరుతో ట్రాఫిక్ పోలీసుల వేధింపులు అన్నీ ఇన్నీ కావని, ఆక్రమణల పేరుతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పార్కింగ్ లేని బడా హోటళ్ల జోలికి వెళ్లకుండా చిన్న వ్యాపారస్తులను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. పెట్టి కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, జీహెచ్‌ఎంసీ గుర్తింపు కార్డులు ఇచ్చినప్పటికీ తమకు జీవనోపాధి లేకుండా పోతున్నదని వాపోయారు. స్ట్రీట్ వెండర్ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీధి వ్యాపారుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి పీఎం సురక్ష భీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, శ్రమయోగి మందన్ పింఛన్ యోజన, మాతృవందన యోజన, జననీ సురక్షణ యోజన, జన్ ధన్ యోజన, వన్ నేషన్ వన్ కార్డు తదితర పథకాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా అమీర్‌పేట, సికింద్రాబాద్, కోఠి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వీధి వ్యాపారులంతా ప్రజావాణి వేదికకు వెళ్లి అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌కు వినతి పత్రం సమర్పించారు.

ద్రోణి ఎఫెక్ట్

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): ఉపరితల ద్రోణి ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసాయి. సోమవారం రాత్రి 9గంటల వరకు బహదూర్‌పురాలోని సులేమాన్‌నగర్‌లో 1.60సెం.మీలు, రాజేంద్ర నగర్‌లో 1.55సెం.మీలు, పటాన్‌చెరులో 1.33సెం.మీలు, గచ్చిబౌలి, ఖాజాగూడలో 1.23సెం.మీలు, అత్తాపూర్‌లో 1.20సెం.మీలు, షేక్‌పేట, బంజారాహిల్స్‌లో 1.0సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా కొనసాగుతున్న ద్రోణి కారణంగా రాగల 24గంటల్లో నగరంలోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

విదేశాల నుంచి వచ్చారా..?

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): దేశంలో మరోసారి కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వ్యాపిస్తున్న వేరియంట్ వల్ల పెద్ద ప్రమాదం లేకపోయినప్పటికీ ప్రజలు భయాందోళనకు గురికాకుండా జాగ్రత్తలు పాటించడం మంచిదంటున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. కేరళ, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో కేసులు పెరుగుతుండడం, మహారాష్ట్ర థానె ప్రాంతంలో 21 ఏండ్ల యువకుడు, బెంగళూరులో 84 ఏండ్ల వృద్ధుడు మరణించడంతో వైద్య, ఆరోగ్యశాఖ మరింత అప్రమత్తమైంది. విదేశీ ప్రయాణాలతోపాటు కరోనా కేసులు అధికంగా ఉన్న ప్రాంతాలకు వెళ్లి వచ్చిన వారు అనుమానిత లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దని, వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పాజిటి వ్ నిర్ధారణ జరిగిన వారు జనావాసాల మధ్య తిరగకుండా స్వీ య ఐసొలేషన్‌లో ఉంటూ వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని గ్రేటర్ వైద్యాధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

6న మహాగణపతి అంకురార్పణ

ఖైరతాబాద్, మే 26 : ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠాపనకు అంకురార్పణ జరుగనున్నది. జూన్ 6న నిర్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కర్ర పూజ క్రతువు నిర్వహించనున్నారు. ఖైరతాబాద్ మహాగణపతి ప్రతిష్ఠాపనోత్సవం 70 సంవత్సరాలు పూర్తి చేసుకొని ఈ ఏడాది 71 వసంతంలోకి అడుగుపెడుతోంది. ఖైరతాబాద్ చౌరస్తాలో నిర్వహించే ఈ వేడుకకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్ కుమార్ కోరారు. కాగా, గతేడాది గణేశ్ ఉత్సవ కమిటీ నుంచి కొందరు సభ్యులు వేరుగా కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఉత్సవాల ఏర్పాటులో తమకు భాగస్వామ్యం దక్కడం లేదంటూ.. ఆరోపిస్తూ గొడవకు సైతం దిగారు. ఉత్సవ కమిటీ ఆవిర్భావం తామే చేశామని, దానికి హక్కుదారులు తామేనంటూ దివంగత చైర్మన్ వారసులు చెబుతుండగా, కొన్నేండ్లుగా తామూ ఉత్సవాల్లో భాగస్వామ్యం అవుతున్నామని.. కమిటీ సభ్యులుగా ఉన్నామని, కానీ ఒకే కుటుంబం ఆ బాధ్యత ఎలా తీసుకుంటుందని కొత్తగా ఏర్పడిన కమిటీ ప్రశ్నిస్తోంది. కర్రపూజ కోసం రెండు కమిటీలు పోటీ పడుతాయా, లేక సమన్వయం పాటించి భక్తుల మనోభావాలను గౌరవిస్తాయా అనేది వేచిచూడాల్సిందే.

స్వచ్ఛ ఆటోల్లోనే చెత్త వేయాలి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

మాన్‌సూన్ శానిటేషన్ ఆటోలను ప్రారంభిస్తున్న మేయర్

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): నగర ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేయర్ గద్వాల విజయలక్ష్మి కోరారు. సోమవారం బంజారాహిల్స్‌లోని ఎన్‌బీటీనగర్‌లో ప్రీ మాన్‌సూన్ శానిటేషన్ డ్రైవ్‌ను మేయర్ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఇంటిలో ఉన్న చెత్తను తప్పని సరిగా స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని, ఓపెన్ ప్రదేశాల్లో వేయకూడదన్నారు. కొన్ని ఏరియాల్లో డస్ట్ బిన్స్ పెట్టినా అందులో వేయకుండా చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. భవన నిర్మాణ వ్యర్థాలు కూడా రోడ్డుపై వేయవద్దని, జీహెచ్‌ఎంసీ సీఅండ్‌డీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ వారికి ఫోన్‌చేస్తే వారే తీసుకొని పోతారని, బయట వేయడం మూలంగా ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంటుందని మేయర్ తెలిపారు. ప్రీ శానిటేషన్ డ్రైవ్‌లో బంజారాహిల్స్ మూడు నుంచి 5 రోజుల్లో క్లీన్ చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రేటర్‌లో ఉన్న150 వార్డులను క్లీన్ చేయడం జరుగుతుందని అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సారి వర్షాలు ముందుగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు, ఫాగింగ్, లాంటి చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి అన్నారు. ప్రజలు సహకరిస్తే క్లీన్ వార్డుగా చేస్తామన్నారు. వర్షాకాలంలో పబ్లిక్ సేఫ్టీ వర్కర్ సేఫ్టీ ప్రాధాన్యనివ్వడం జరిగిందని జలమండలి జీఎం హరిశంకర్ తెలిపారు. వాటర్ లాగింగ్ ఏరియాలో రెడ్ కలర్లో ఉన్న మ్యాన్‌హోల్స్ ప్రజలు ఓపెన్ చేయవద్దన్నారు. జీహెచ్‌ఎంసీ చేసే ప్రతి కార్యక్రమానికి జలమండలి పూర్తి సహకారం అందిస్తుందని హరిశంకర్ తెలిపారు.

ప్రీ మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్

బంజారాహిల్స్: బస్తీలు, కాలనీల్లో చెత్త సమస్యను పరిష్కరించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రీ మాన్సూన్ స్పెషల్ డ్రైవ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని జీహెచ్ ఎంసీ మేయర్ విజయలక్ష్మి తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎన్‌బీటీ నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను మేయర్ ప్రకటించారు. పైలట్ ప్రాజెక్టుగా బంజారాహిల్స్ వార్డులోని అన్ని బస్తీలు, కాలనీల్లో 14మంది సభ్యులతో కూడిన బృందాలు పర్యటించి చెత్తకుప్పలు తొలగించడం, నిర్మాణ వ్యర్థాలను తొలగించేలా అవగాహన కల్పించడం, దోమల నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించనున్నారన్నారు.

ఫ్రెండ్స్‌తో ఆడుకుంటాం.. పార్కు కావాలె

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీ ప్రజావాణిలో సోమవారం ఒక ఫిర్యాదు విస్తృత చర్చకు దారి తీసింది. ప్రజాపాలనలో పౌరులకు కనీస మౌలిక వసతులు లేవని నిరూపించింది. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల నుంచి అధికారులు ఆర్జీలను స్వీకరిస్తున్న క్రమంలో మూసాపేట నుంచి ఇద్దరు చిన్నారులు అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. మూసాపేటలో పిల్లలు ఆడుకోవడానికి ఒక్క పార్కు కూడా లేదని, అంజయ్య నగర్‌లో ఉన్న పార్కు స్థలాన్ని కొందరు కబ్జా చేశారని చిన్నారులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ పార్కును అభివృద్ధి చేసేందుకు గతంలో రూ.50 లక్షలు మంజూరు చేశారని, నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ఆగిపోయాయని, వెంటనే పనులు ప్రారంభించాలని విన్నవించారు. 'మేమంతా ఫ్రెండ్స్‌తో కలిసి పార్కులో ఆడుకుంటామం'టూ ఆ చిన్నారుల అధికారుల ఇచ్చిన వినతిపత్రంలో వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తెలుగు యూనివర్సిటీ : సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2025-26 విద్యా సంవత్సరానికి రెగ్యులర్ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచా ర్య కోట్ల హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తెలుగు వర్సిటీ నిర్వహించే శిల్పం-చిత్రలేఖనం, డిజై న్, సంగీతం, రంగస్థలం, శాస్త్రీయ నృత్యం (కూచిపూడి, ఆంధ్రనాట్యం), జానపదం, తెలుగు, చరిత్ర-పర్యాటకం, భాషాశాస్త్రం, జర్నలిజం, జ్యోతిష్యం, యోగా కోర్సుల కొరకు ఎంఏ, డిగ్రీ, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రాంలలో అర్హత కలిగి ఆసక్తిగల విద్యార్థుల ప్రవేశం కోసం విశ్వవిద్యాలయం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.